# శిక్షణ లేని కార్మికులతో బాణసంచా తయారీ

**ఎప్పుడు పేలుతాయో తెలియని పరిస్థితి**

**రాష్ట్రంలో ప్రమాదకరంగా బాణసంచా తయారీ కర్మాగారాలు**

**కనీస అవగాహన లేనివారితో తయారీ - ఎప్పుడు సామగ్రి పేలుతాయో తెలియని పరిస్థితి**

**తమిళనాడు శివకాశిలో ఏటా వేల మందికి శిక్షణనిస్తున్న ప్రభుత్వం**



బాణసంచా పేలుడు కర్మాగారంలో పనిచేసే కార్మికులు పొటాషియం నైట్రేట్, బేరియం, మిథైల్ క్లోరైట్, డెస్ట్రిన్ ఈ పేర్లు అసలు తెలీవు. ఆ రసాయనాల లక్షణాలు, వీటిని వేటితో కలిపితే ఏ విధమైన సమ్మేళనాలు ఏర్పడతాయో వీరికి తెలీదు. పదార్థాల మిశ్రమాన్ని కలిపేటప్పుడు దేని పరిమాణం ఎంతుండాలో, ఆ మోతాదును మించితే ఏం జరుగుతుందో ఓ అంచనా లేదు. ఈ విధమైన పేలే స్వభావం గల పదార్థాలతో పని చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలియదు. అరకొర అక్షరజ్ఞానం కలిగిన రోజువారి కార్మికులు. బాణసంచా తయారీ కేంద్రాల్లో పని చేస్తున్నప్పటికీ, అక్కడ పని వాతావరణంపై వీరికి కనీస శిక్షణ లేదు. సీనియర్ కార్మికులను అనుసరిస్తూ వెళ్లడమే. అంతేకాకుండా ఈ పని ఎంత ప్రమాదకరమో వారికి తెలియదు. కాకినాడ జిల్లా వేట్లపాలెంలో ఇటీవల ఇటీవల సంభవించిన పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువమంది బాణాసంచా తయారీలో కనీస అవగాహన లేనివారే. ఏపీలో లైసెన్స్ ఉన్న బాణసంచా తయారీ కేంద్రాలు కేవలం 93 మాత్రమే ఉన్నాయి. వీటిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే 60 ఉండగా, అనకాపల్లి జిల్లాలో 10 ఉన్నాయి. అనధికార బాణసంచా తయారీ కేంద్రాలు దానికి ఐదు లేదా ఆరు రెట్లు ఉంటాయి. ఇవన్నీ ఇప్పుడు పేలుతాయో తెలియని మందుగుండు సామాన్లే. అయితే వీటిని ఇందులో పని చేస్తున్న వేల మంది కార్మికులు జీవితాలు గాలిలో దీపాలే. ప్రమాదాలకు ప్రధాన కారణాలు: బాణసంచా సామగ్రి మండేందుకు, పేలేందుకు, రంగులను వెదజల్లేందుకు, శబ్దాలు వెలువడేందుకు ఆక్సిడైజర్లు, ఫ్యూయల్స్, కలరెంట్స్, బైండర్స్‌గా వివిధ రకాల రసాయనాలను వినియోగిస్తారు. ఇవి అత్యంత ప్రమాదకరమైనవి. వీటన్నింటి మిశ్రమాలను కలిపేందుకు, వినియోగించేందుకు సిబ్బందికి ప్రత్యేక నైపుణ్యం, శిక్షణ, పరికరాలు అవసరం. మోతాదులో కొంచెం తేడా వస్తే పేలుళ్లకు కారణమవుతాయి. ప్రధానంగా బాణసంచా కేంద్రాల్లో పనిచేసే కార్మికులకు తగినంత శిక్షణ, అనుభవం లేకపోవడం. రసాయనాల మిశ్రమాలను కలపే ప్రక్రియలో మెకానికల్ ఫ్రిక్షన్, స్పార్క్ తలెత్తడంతో సంభవించే పేలుళ్లు అనధికార యూనిట్లలో తగిన వెంటిలేషన్ లేకపోవడం, నివాస గృహాల నుంచి తగినంత దూరాన్ని పాటించకపోవడం. సిబ్బంది మధ్య తగినంత దూరం పాటించకపోవడం, వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరించకపోవడం, ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర స్పందనకు తగిన యంత్రాగం లేకపోవడం. ప్రమాదం గల రసాయనాలు: బాణసంచా తయారీలో ఆక్సిడైజర్లుగా పొటాషియం నైట్రేట్, పొటాషియం క్లోరేట్, పొటాషియం పెర్‌క్లోరేట్, బేరియం నైట్రేట్, స్ట్రాంటియమ్ నైట్రేట్, సోడియం నైట్రేట్ వంటి రసాయనాలను ఉపయోగిస్తారు. అవి బాణసంచా వేగంగా మండేందుకు అవసరమైన ఆక్సిజన్ సరఫరాకు ఉపయోగపడతాయి. అంతేకాకుండా ఆక్సిడైజర్లతో కలిసి వేడి, గ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు ఫ్యూయల్స్‌గా అల్యూమినియం పౌడర్, మెగ్నీషియం, టైటానియం, సల్ఫర్, బొగ్గుపొడిని వినియోగిస్తారు. రంగులను వెదజల్లేందుకు స్ట్రాంటియం కాంపౌండ్స్, బేరియం, కాపర్, సోడియం, కాల్షియం, ఐరన్ వంటి వాటిని వినియోగిస్తారు. పేలుళ్ల కోసం గన్ పౌడర్ (75% పొటాషియం నైట్రేట్, 15% బొగ్గు, 10% సల్ఫర్) ఉపయోగిస్తారు. ఇంకా కొన్ని ఫ్లాష్ పౌడర్లను సైతం వినియోగిస్తారు. రసాయన పదార్థాల మధ్య బాండేజ్ కోసం డెస్ట్రిన్, గమ్‌అరబిక్ వంటి పదార్థాలు, మిథైల్ క్లోరైడ్ వంటి సాల్వెంట్లు, బేరియం క్రోమేట్ వంటి పదార్థాలను వినియోగిస్తారు. కాగితాలకే పరిమితమైన నిబంధనలు: ప్రధానంగా బాణసంచా కర్మాగారాల్లో పనిచేసే సిబ్బందికి శిక్షణను ఇవ్వాలనే నిబంధనలను ఆచరణలో అమలు కావడం లేదు. రసాయన పదార్థాలను ఏ విధంగా హ్యాండిల్ చేయాలి?, ఏ విధంగా కలపాలి?, ఎలా నిల్వ చేయాలి?, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి వంటి అంశాల్లో విధిగా శిక్షణను ఇచ్చిన తర్వాతే పనిలో చేర్చుకోవాలి. అగ్ని ప్రమాదాల నివారణ, ప్రథమ చికిత్స, వ్యర్థాలను సురక్షిత పద్ధతులలో డిస్పోజ్ చేయడంపై ప్రతి మూడు నెలలకు రిఫ్రెషర్ కోర్సులను నిర్వహించాలి. అంతేకాకుండా సూపర్‌వైజర్లు, ఫోర్‌మెన్‌కు పర్యవేక్షణ, ప్రమాదాల అంచనా, భద్రతా చర్యల అమలులో ప్రత్యేక శిక్షణను అందించాలి. బాణసంచా తయారీ కేంద్రాల్లో కార్మికులకు ప్రత్యేక రక్షణ పరికరాలను ధరించాలి. కానీ ఏపీలో లైసెన్స్ ఉన్న కేంద్రాల్లోనే ఒట్టి చేతులతో రసాయనాలను కలిపేస్తున్నారు. చాలా మందికి కనీసం కాళ్లకు చెప్పులు సైతం ఉండవు. అనధికారిక కేంద్రాల్లో పరిస్థితిని చెప్పాల్సిన అవసరం లేదు. బాణాసంచా కేంద్రాల్లో పేలుళ్లు, మంటలు, శబ్దాల నుంచి రక్షణకు వ్యక్తిగత రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలి. రక్షణ పరికరాలు తప్పనిసరి: మంటలు, వేడి నుంచి రక్షణనిచ్చే మెటీరియల్‌తో తయారైన పొడవు చేతుల చొక్కాలు, ప్యాంట్‌లు, మెరుపుల నుంచి రక్షణనిచ్చే బూట్లు, గ్లోవ్స్, గట్టి టోపీలు ధరించాలి. కళ్లు, ముఖాన్ని రక్షణ కోసం సైడ్ షీల్డ్స్ ఉన్న కళ్లజోళ్లు, రసాయనాల మిక్సింగ్ పనులను చేసేవారు ముఖం మొత్తాన్ని కప్పుకునే విధంగా ఫుల్‌షీల్డ్‌లను ధరించాలి. వీటితోపాటు దుమ్ము, రసాయన వాయువుల నుంచి రక్షణకు శ్వాసకోశ రక్షణ వ్యవస్థలు ఉండాలి. అగ్నిమాపక పరికరాలు, స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్ వంటి పరికరాలుండాలి. శివకాశిలో ప్రత్యేక కార్యక్రమాలు: తమిళనాడులోని విరుధ్‌నగర్ జిల్లా శివకాశిలో దాదాపు గత శతాబ్ద కాలంగా బాణసంచాను తయారు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా వినియోగించే బాణసంచాలో 80–90 శాతం అక్కడే ఉత్పత్తవుతుండటం గమనార్హం. తమిళనాడులోని సుమారు 1,500 లైసెన్స్‌డ్ యూనిట్‌లలో అత్యధికం శివకాశి, దాని చుట్టుపక్కల చుట్టే ఉన్నాయి. అక్కడ అనధికారికంగా 8,000 యూనిట్‌లు ఉంటాయని ఓ ప్రాథమిక అంచనా. ఇక్కడ ఒకప్పుడు ప్రమాదాలు తరచూ జరిగేవి. కానీ ప్రభుత్వం తగిన నియంత్రణ చర్యలు చేపట్టడం, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో కొంతకాలంగా ప్రమాదాలనేవి అదుపులోకి వచ్చాయి. ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి, ఇప్పటికే వేల మందికి శిక్షణను అందించింది. ఒక్క 2024వ సంవత్సరంలోనే మొత్తం 7,500 మంది శిక్షణ పొందారు. అదే విధంగా పెసో, ఇతర సంస్థలతో కలిసి సూపర్‌వైజర్లు, ఫోర్‌మెన్‌కి ప్రత్యేక శిక్షణను ఇస్తోంది. మదురై, శివగంగ , థేని, దిండిగల్ జిల్లాల్లోనూ ప్రత్యేక శిబిరాలు, అవుట్‌రీచ్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.


# టెక్నాలజీతో అటవీ జంతువుల సంరక్షణ

**కూటమి సర్కారు ముందడుగు**

**నేడు హనుమాన్ ప్రాజెక్టు ప్రారంభించనున్న పవన్‌కల్యాణ్, లోకేశ్**

**ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మంగళగిరిలో కార్యక్రమం**

**11 అంశాలతో హనుమాన్ ప్రాజెక్టును రూపొందించిన అటవీశాఖ**




మనుషులు, జంతువుల మధ్య సంఘర్షణ నివారించడంతో పాటు టెక్నాలజీ సాయంతో అటవీ జంతువుల సంరక్షణ చేపట్టేలా కూటమి సర్కారు ముందడుగు వేసింది. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో అటవీశాఖ అధికారులు రూపొందించిన హనుమాన్ ఫౌండేషన్ ప్రాజెక్టు ప్రారంభానికి సిద్ధమైంది. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా నేడు మంత్రి నారా లోకేష్‌తో కలిసి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అడవి ఏనుగుల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బంది తప్పించటంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన మేరకు అటవీశాఖ అధికారులు కసరత్తు చేశారు. అటవీ ప్రాంతాల్లో వణ్యప్రాణులకు ఎదురవుతున్న సమస్యలు తగ్గించటం సహా జనారణ్యంలోకి జంతువులు వచ్చి ప్రజలను ఇబ్బంది పెట్టకుండా చూసేందుకు హనుమాన్ పేరిట కార్యక్రమం రూపొందించారు. నాలుగు నెలల క్రితం పవన్ కల్యాణ్ చిత్తూరు జిల్లా అటవీ ప్రాంతానికి వెళ్లినప్పుడు అటవీశాఖ అధికారులు దీనిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 11 అంశాలతో కూడిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి మరికొన్ని మార్పులు చేర్పులు చేసి ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నారు. జంతు సంచారానికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు వీలుగా గతంలో ఉన్న యాప్ ఆధునీకరించారు. ఏనుగులతో పాటు వణ్యప్రాణులకు ప్రత్యేక రేడియో కాలర్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. ఏనుగుల సంచారం ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉంది. గుంపులుగా తిరిగే ఏనుగులతో పాటు ఒంటరి ఏనుగులు సమాచారం తెలిసేలా రూపకల్పన చేశారు. దీని కోసం కేంద్రం నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. ఇదే సాంకేతికతతో ఇటీవల రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోకి వచ్చిన పులిని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అలాగే ఏనుగుల రాకను పసిగట్టి తుపాకీ శబ్దాలు చేసే వ్యవస్థను కూడా కొన్నిచోట్ల ఏర్పాటు చేశారు. ఇవన్నీ ప్రయోగాత్మకంగా విజయవంతమయ్యాయి. వాటిని పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చేందుకు హనుమాన్ ప్రాజెక్టుని ప్రారంభిస్తున్నారు. ఏనుగుల దాడిలో ఎవరైనా గాయపడితే వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించేలా అంబులెన్సులు సమకూర్చారు. ప్రాణ, ఆస్తినష్టం జరిగినా పరిహారం కూడా ఈ ప్రాజెక్టు కింద అందించనున్నారు. జనావాసాల్లోకి వచ్చిన పాముల నుంచి ప్రజలకు హాని జరక్కుండా వాటిని పట్టుకుని అడవుల్లో వదిలేలా వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. సర్పమిత్ర పేరుతో వాలంటీర్లు సేవలందిస్తారు. ఇలాంటి 11 ప్రత్యేకతలతో రూపొందిన హనుమాన్ ఫౌండేషన్ ప్రాజెక్టును పవన్ కళ్యాణ్, నారా లోకేష్ కలిసి మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్ మైదానంలో జరిగే కార్యక్రమంలో ప్రారంభిస్తారు. వాలంటీర్లుగా గ్రామ యువకులు: అటవీ శాఖ సిబ్బందితో పాటు స్థానికుల భాగస్వామ్యం కూడా ఈ ప్రాజెక్టులో చాలా కీలకమైనది. అందుకే అటవీ సరిహద్దు గ్రామల్లోని చురుకైన యువకులను గుర్తించి, వారిని వాలంటీర్లుగా నియమిస్తారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అలాగే హనుమాన్ ప్రాజెక్టు కోసం అటవీ శాఖ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఒక్కో సర్కిల్ పరిధిలో 2 రెస్క్యూ బృందాలు నిరంతరం విధులు నిర్వహిస్తాయి. వీరికి అత్యాధునిక వైర్ లెస్ సెట్లు, యానిమల్ మేనేజ్‌మెంట్ పరికరాలు అందజేస్తారు. ప్రమాదవశాత్తూ గాయపడే వన్యప్రాణులకు తక్షణ చికిత్స అందించడం చాలా ముఖ్యం. అందుకే ప్రతి సర్కిల్‌కు 2 అధునాతన అంబులెన్సులనూ కేటాయిస్తారు. వాటితో పాటు ఇద్దరూ వెటర్నరీ డాక్టర్లు కూడా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు.

# సంపూర్ణ చంద్రగ్రహణం - యాదగిరిగుట్ట ఆలయం మూసివేత

**సంపూర్ణ చంద్రగ్రహణం దృష్ట్యా యాదగిరిగుట్ట ఆలయాన్ని మూసివేసిన అర్చకులు**

**సంప్రోక్షణ, ఆలయ శుద్ధి అనంతరం నిత్యా పూజలు చేసి దర్శనానికి భక్తులకు అనుమ**

**ఆలయాన్ని మూసివేసిన అర్చకులు, అధికారులు**



సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు దేవాలయాలను మూసివేశారు. అందులో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని ఉదయం 7 గంటలకు ఆలయ అర్చకులు, అధికారులు సమక్షంలో మూసివేశారు. బుధవారం ఉదయం 3 గంటల వరకు ఆలయం మూసే ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు తెలిపారు. రేపు ఉదయం 3 గంటల తర్వాత సంప్రోక్షణ, ఆలయ శుద్ధి, నిత్య పూజలు చేసి స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని వివరించారు.

**శ్రీవారి గర్భాలయాన్ని మూసివేసిన అధికారులు :** టీటీడీ అధికారులు చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయాన్ని మూసివేశారు. చంద్రగ్రహణం కారణంగా సుమారు 10.30 గంటల పాటు ఆలయం మూసివేత ఉంటుందని ప్రకటించారు. ఉదయం 9 గంటలకు శ్రీవారి గర్భాలయం, మహాద్వారాన్ని అర్చకులు మూసివేశారు. మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 6.47 గంటల వరకు చంద్రగ్రహణ కాలం ఉండనుంది. తిరుమలలో ఉదయం 9 గంటలకు అన్నవితరణ కేంద్రాల్లో ప్రసాదాల తయారీ నిలిపివేశారు. సాయంత్రం గ్రహణం వీడాక శుద్ధి, పుణ్యాహవచనంతో దర్శనాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. నేటి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖల స్వీకరణ అనుమతిని టీటీడీ నిరాకరించింది.

**టికెట్ల జారీ నిలిపివేసిన టీటీడీ :** ఇవాళ శ్రీవారి ఆలయంలో పలు ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఇప్పటికే తిరుపతిలో సర్వదర్శన టోకెన్ల జారీ నిలిపివేసిన అధికారులు రేపు శ్రీవారి సర్వదర్శన టోకెన్లు జారీ పునఃప్రారంభించారు. నేడు శ్రీవాణి ట్రస్టు దాతల టికెట్ల విక్రయాలను కూడా నిలిపివేశారు. విమానాశ్రయంలో 200, రోజువారీ ఆన్‌లైన్ టికెట్ల జారీని టీటీడీ నిలిపివేసింది. భద్రాచలంలోని ఆలయాన్ని ఉదయం 8.30 గంటలకు మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం రాత్రి 8 గంటలకు భక్తులకు దర్శనాలు ఉంటాయని అధికారులు తెలిపారు. జగిత్యాల జిల్లాలో వైభవంగా ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బ్రహ్మ పుష్కరిణిలో తెప్పోత్సవం, డోలొత్సవం జరిగింది. చంద్రగ్రహణం దృష్ట్యా ఉదయం 9 గంటలకు లక్ష్మీ నరసింహస్వామి ఆలయం మూసివేశారు. బుధవారం ఉదయం సంప్రోక్షణ, గ్రహణ హోమం అనంతరం భక్తుల దర్శనానికి అనుమతి ఉంటుందని వెల్లడించారు.


# మార్చురీ గదిలో శవాన్ని పీక్కుతిన్న కుక్క

**జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం**

**ప్రభుత్వాసుపత్రి మార్చురీలో శవాన్ని పీక్కుతిన్న కుక్కలు**

**బహిర్భూమికని బయటకు వెళ్లి కనపడకుండాపోయిన భీమేశ్వర్ అనే వ్యక్తి**

**శవాగారంలోకి కుక్క వచ్చిన వెంటనే తరిమేశారన్న ఆసుపత్రి సూపరింటెండెంట్**



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం హృదయ విదారక ఘటన వెలుగు చూసింది. శనివారం జడ్చర్ల మండలంలోని నాగసాల గ్రామానికి చెందిన పోలే భీమేశ్వర్ (32) అనే వ్యక్తి ఇంటి నుంచి బహిర్భూమికని బయటకు వెళ్లారు. ఆయన లారీ డ్రైవర్‌గా పని చేసేవారు. దీంతో విధులకు వెళ్లారని కుటుంబసభ్యులు భావించి, పట్టించుకోకుండా ఉన్నారు. భీమేశ్వర్ రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం స్థానిక చెరువులో మృతదేహం తేలడంతో పోలీసులు శవాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కింద నేలపైనే వదిలేశారు. అక్కడ సరైన భద్రత లేకపోవడంతో ఓ కుక్క లోపలకు చొరబడి శవాన్ని పీక్కుతింటూ కనిపించడం కలకలం రేపింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళను ఈటీవీ భారత్ వివరణ కోరగా పోస్టుమార్టం సిబ్బంది గదిలోకి వెళ్తుండగానే కుక్క కూడా వెళ్లిందని, అప్పుడే సిబ్బంది దాన్ని బయటకు తరిమేశారని తెలిపారు.

**ఆసుపత్రిని ఉన్నతీకరించినా – పాత దానిలోనే :** జడ్చర్లలో 30 పడకల ఆసుపత్రిని 2023లో 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. నూతన ఆసుపత్రిలో మార్చురీకి సంబంధించిన పరికరాలు, ఇతర వసతులు ఇంకా ఏమీ కల్పించలేదు. దీంతో పాత ఆసుపత్రి మార్చురీలోనే పోస్టుమార్టంనకు సంబంధించిన పనులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఓ మృతదేహాన్ని మార్చురీకి తీసుకువచ్చి అక్కడి పరిస్థితులను చూసి రాత్రంతా అంబులెన్సులోనే ఉంచి, ఉదయం పోస్టుమార్టం చేయించడం గమనార్హం. సమస్యలను ఉన్నతాధికారులకు చెబుతున్నా స్పందన కరవవుతోందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

**ఎంపీ అరుణ ఆగ్రహం :** జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి ఘటనపై బీజేపీ ఎంపీ డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం పై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్న చోట పరిస్థితి ఇలా ఉంటే ఇతర జిల్లాల సంగతీ ఏంటని ప్రశ్నించారు. జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఘటనతో వైద్య ఆరోగ్య శాఖపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందన్నారు. పేదల ఇళ్లనను కూల్చడంపై ఉన్న శ్రద్ధ పేద ప్రజలకు వైద్యం అందించడంలో లేదన్నారు.

**సిబ్బందిపై సస్పెన్షన్ వేటు :** జడ్చర్ల పాత ప్రభుత్వ ఆస్పత్రి ఘటనతో వైద్య శాఖ ఉలిక్కిపడింది. దీంతో వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ వెంటనే ఆసుపత్రిని పరిశీలించారు. మార్చురీలో ఉన్న మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై విచారణకు ఆదేశించారు. జడ్చర్ల ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్, ఎంఎన్‌వోలను విధుల నుంచి సస్పెండ్ చేశారు.


# అధికారుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు

**ఇకపై ఏ సర్టిఫికెట్ అయినా ఆన్‌లైన్‌లోనే**

**రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద ఆదాయ ధ్రువపత్రాల జారీ ప్రక్రియ**

**దశల వారీగా కుల, నివాసం వంటి ఇతర ధ్రువపత్రాలు సులువుగా జారీ చేసే విధానం**

**ఇబ్బందులు దూరం చేసేలా ప్రభుత్వ విధానం**



చదువు కోసం, ఉద్యోగాల కోసం ఇన్‌కమ్ సర్టిఫికెట్ కావాలంటే మీ సేవ కేంద్రంలో అప్లై చేసుకుని, ఆ తర్వాత ఆ దరఖాస్తుకు జత చేసిన ఆధార్, రేషన్‌కార్డు, ఇతర పత్రాలతో రెవెన్యూ ఆఫీసుకు వెళ్లి సిబ్బందిని బతిమాలే రోజులు త్వరలోనే దూరం కానున్నాయి. మీ సేవ కేంద్రం ద్వారా అప్‌లోడ్ చేసిన పేపర్ల ఆధారంగా ఎక్కడికీ వెళ్లకుండానే సర్టిఫికెట్లు జారీ చేసే పారదర్శక సేవలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పైలట్ ప్రాజెక్టు కింద తొలుత అత్యవసరంగా భావించే ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ ప్రారంభం కాగా, దశలవారీగా క్యాస్ట్, రెసిడెన్సీ వంటి ఇతర ధ్రువపత్రాలు సులువుగా జారీ చేసే విధానం అందుబాటులోకి తీసుకురానున్నారు. చేతులు తడపనిదే పని కాదు : పుట్టిన దగ్గర నుంచి చనిపోయే వరకు ప్రతి వ్యక్తి ఏదో ఒక సందర్భంలో రెవెన్యూ ఆఫీస్‌లో అడుగుపెట్టాల్సి ఉంటుంది. ఇదే అదునుగా అక్కడ కొంతమంది సిబ్బంది అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని అన్ని సవ్యంగానే ఉన్నా, చేతులను తడపనిదే సర్టిఫికెట్లు జారీ చేయడం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున ఉన్నాయి. మీ సేవ ద్వారా దరఖాస్తు సమర్పించినా మళ్లీ కార్యాలయానికి, రెవెన్యూ సిబ్బంది వద్దకు పరుగులు పెడుతున్న తరుణంలో దరఖాస్తుదారుల ఇబ్బందులు దూరం చేసేలా సర్కారు కొత్త విధానం ఊరటనివ్వనుంది.

**ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ :** మీ సేవ ద్వారా అప్లై చేస్తే దరఖాస్తు తొలుత గ్రామ రెవెన్యూ పాలనాధికారి (జీపీవో) లాగిన్‌లోకి వస్తుంది. ఆయన విచారణ తర్వాత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఎంఆర్ఐ)కి, తదనంతరం ఆర్ఐ నేరుగా డిప్యూటీ తహసీల్దార్(డీటీ) లాగిన్‌కి చేరవేరుస్తారు. ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు జిల్లా, రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తుంటారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం చేసే వీలుండదు. ఇప్పటికే చాలా చోట్ల ఆదాయ పత్రాన్ని ఆన్‌లైన్‌లో ధ్రువీకరించే ప్రక్రియ మొదలైందని ఆదిలాబాద్ జిల్లా మీ సేవల విభాగం మేనేజర్ బండి రవి తెలిపారు.

**ఆఫీసులకు రాకుండా పనులు జరగాలి :** ఇటీవల ఐఏఎస్‌లతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలు ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారానే అన్ని సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలు తేవాలని అధికారులందరికీ సూచించారు. విద్యుత్ మీటర్, ఇంటి నిర్మాణానికి పర్మిషన్, నల్లా కనెక్షన్ ఇలా ప్రభుత్వం నుంచి పొందాల్సిన అనుమతులు, సేవలకు ప్రజలు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేకుండా పనులు జరగాలని ఆదేశాలు జారీ చేశారు. ఏ ఫైలు, ఏ అర్జీ ఎక్కడ ఉందో అప్లికేషన్ చేసిన వ్యక్తి తెలుసుకునే విధంగా సులభమైన పద్ధతులు ఉండాలన్నారు. అలాగే రైతుల భూ సమస్యలు వేగంగా పరిష్కరించే విధంగా ఉండాలన్నారు.

**ఈ–ఆఫీస్, డిజిటల్ గవర్నెన్స్ విధానం అమలు చేయండి :** సమూల మార్పులతో సాంకేతిక సంస్కరణలు అమలు చేసేందుకు సీనియర్ ఐఏఎస్ జయేశ్ రంజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ వేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 3 వారాల్లో కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అందించాలని నిర్దేశించారు. ప్రతి విభాగం ఈ–ఆఫీస్ విధానం, డిజిటల్ గవర్నెన్స్ అమలు చేయాలని, అన్ని శాఖలకు సంబంధించిన డేటా నిల్వ చేస్తున్న పాత కాలం సర్వర్‌లను వచ్చే 20 ఏళ్లకు సరిపడేలా క్లారిటీతో అప్‌గ్రేడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. మహాలక్ష్మి, రేషన్ కార్డులు, రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ వంటి సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ చేరాలన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను వెంటనే అందించాలన్నారు. రేషన్ కార్డులు అప్లై చేసుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సీఎం చెప్పారు.

